ప్రజాశక్తి
సోమవారం 29 మే 2023
5
కర్నూలు

పోరాటాలతో ముందుకు..

- బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై అనేక ఆందోళనలు
- సేవా కార్యక్రమాలూ నిర్వహణ
- అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

కేవలం వారి రంగం కోసమే కాకుండా అన్ని ప్రభుత్వ రంగాల రక్షణ కోసం, ప్రజా సమస్యలపైనా పోరాటాలతో ముందుకు సాగిస్తున్నారు అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం పోస్ట్‌మెన్ మరియు ఎంటిఎస్ నాయకులు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై అనేక ఆందోళనలు సాగించారు. సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఆ సంఘం 3వ ద్వైవార్షిక రాష్ట్ర మహాసభ సందర్భంగా ప్రజాశక్తి పలువురు నాయకులను పలకరించింది. వారి పోరాట అనుభవాలు ఇలా...

ప్రజా వ్యతిరేక విధానాలపై..

మొదట నుంచి కేవలం తపాలా శాఖ సమస్యలే కాకుండా ప్రజల సమస్యలపైనా పోరాటాలు చేశాం. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాం. ఢిల్లీలోనూ ఆందోళనలు చేశాం. ఉపాధి హామీ కూలీలు కూలి తీసుకోవడానికి వచ్చినప్పుడు మంచి నీటి సౌకర్యం కల్పించాం. కరోనా సమయంలో నిత్యావసర వస్తువులు, మందులు అందజేశాం. నేను పదేళ్లుగా యూనియన్‌లో ఉన్నాను.

- మహమ్మద్ జానీ, డివిజనల్ అసిస్టెంట్ కార్యదర్శి, కర్నూలు.

పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు

నేను 15 ఏళ్లుగా యూనియన్‌లో ఉన్నాను. కొత్త పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పెద్ద ఎత్తున ఆందోళనలు సాగించాం. 18 నెలల డిఎ బకాయిలు ఇవ్వాలని పోరాటం చేశాం. అధికారుల టార్గెట్ ఒత్తిడికి వ్యతిరేకంగా ధర్నాలు, సమ్మె నిర్వహించాం. మార్చి 28, 29న అన్ని సంఘాలతో కలిసి సమ్మె చేశాం. ఉద్యోగినికి మెడికల్ లీవ్ ఇవ్వకపోతే అధికారిపై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున ధర్నా చేశాం. అధికారుల వేధింపులపై పోరాటం చేశాం. పి3 గుర్తింపు రద్దుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాం.

- ఎ.నాగేశ్వర, డివిజనల్ కార్యదర్శి, అనంతపురం.

1982 నుంచి యూనియన్‌లో..

1982 నుంచి యూనియన్‌లో ఉన్నాను. అన్ని రకాల పోరాటాలూ సాగిస్తున్నాం. పే కమిటీ కోసం 16 రోజుల సమ్మెల చేశాం. నేను చిన్నప్పటి నుంచి విద్యార్థి సంఘంలో ఉండేవాడిని. అలా ఉద్యమాల వైపు ప్రభావితం అయ్యాను. 1982లో జిడిఎస్ ప్యాకర్‌గా చేరాను. అప్పటి నుంచి సంఘంలో ఉన్నా. కేంద్ర, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాం.

- పి.వెంకటేశ్వరరావు, జిడిఎస్ డివిజనల్ కార్యదర్శి, ప్రకాశం.

డివిజన్ కమిటీగా సహకారం..

విజయవాడ రాష్ట్ర కేంద్రం కావడంతో అన్ని ఆందోళనలూ అక్కడ ఎక్కువగా సాగిస్తుంటారు. అక్కడ జరిగే పోరాటాలకు డివిజన్ కమిటీగా సహకారం అందిస్తున్నాం. కరోనా సమయంలో ఇవ్వాల్సిన బకాయిలపై పోరాటాలు సాగించాం. పి3 గుర్తింపు రద్దు చేసిన నేపథ్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాం. కేంద్ర, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు కార్యక్రమాలు చేపట్టాం. నేను ఐదేళ్లుగా యూనియన్‌లో ఉన్నాను.

- ఎం.సుమన్ కుమార్, డివిజనల్ అధ్యక్షులు, విజయవాడ.

అట్టహాసంగా..
ఎఐపిఇయు రాష్ట్ర మహాసభ ప్రారంభం

- దేశభక్తి పేరుతో బిజెపి ఆర్ఎస్ఎస్ దోపిడీ : సిహెచ్.నరసింగరావు

ఎఐపిఇయు రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్, వేదికపై సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం (ఎఐపిఇయు) పోస్ట్‌మెన్ మరియు ఎంటిఎస్ 3వ ద్వైవార్షిక రాష్ట్ర మహాసభ కర్నూలు నగరంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. బిఎఎస్ కళ్యాణ మండపంలోని ఎన్ఎస్ మూర్తి సభా ప్రాంగణంలో మహాసభ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను సిహెచ్.నరసింగరావు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ (ఎన్ఎఫ్‌పిఇ) జెండాను ఎఐపిఇయు సర్కిల్ కార్యదర్శి సిహెచ్.విద్యాసాగర్ ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళు లర్పించారు. సంతాప తీర్మానాన్ని విద్యా సాగర్ ప్రవేశపెట్టారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి పేరుతో బిజెపి, ఆర్ఎస్ఎస్ దేశ సందపను దోచుకుంటున్నాయన్నారు. మోడీ విధానాలనే రాష్ట్రంలో జగన్ అమలు చేస్తున్నారని, రాష్ట్రంలో మూడు పార్టీలూ మోడీకి తలవంచి ఆ విధానాలనే అమలు చేస్తున్నారని తెలిపారు. సీక్రెట్ బ్యాలెట్ ద్వారానే సంఘాల గుర్తింపును నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పి3 యూనియన్ గుర్తింపు రద్దుకు వ్యతిరేకంగా అందరూ పోరాడాలన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చారని, అవి అమలైతే కార్మికులను బానిసల కంటే హీనంగా చూస్తారని చెప్పారు. తపాలా శాఖను ప్రయివేటీకరణ చేసేందుకు పోస్టల్ కార్పొరేషన్‌గా మార్చుందుకు ప్రభుత్వం కుట్ర చేసిందని, తీవ్ర పోరాటాలతో వెనక్కి తగ్గిందని తెలిపారు.

బిజెపిని ఇంటికి పంపాలి : ఎంఎ.గఫూర్

పాత పెన్షన్ విధానం అమలు, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వరంగాన్ని రక్షించుకోవడం కోసం, మతం పేరుతో చేస్తున్న కుట్రలను వ్యతిరేకించేలా బిజెపిని ఇంటికి పంపడం కోసం పని చేయాలని సిఐటియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను, కార్మికులను చైతన్యవంతం చేయాలని పేర్కొన్నారు. పార్లమెంట్ ప్రారంభాన్ని చూస్తే మత ప్రాదిపదికన పాలన నడుస్తోందని అనిపిస్తోందన్నారు. దేశం మతరాజ్యం కాదన్నారు. దేశంలో పోరాడే కార్మిక సంఘాలు లేకుండా చేయాలని బిజెపి ప్రయత్నాలు చేస్తోందని, ఆ ప్రయత్నాలు ప్రతిఘటించకపోతే నష్టపోతామని తెలిపారు.

కార్మిక హక్కులు, భద్రత కోసం పోరాడాలి : పినాకపాణి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికుల హక్కులు, భద్రత కోసం పోరాటాలు చేయాలని విరసం నేత పినాకపాణి పిలుపునిచ్చారు. కార్మికులు బలమైన చైతన్యంతో పోరాటాలు చేయాలని పేర్కొన్నారు. తపాలా ఉద్యోగులు అనుకోకుండా కార్మికులను అనుకున్నప్పుడే పోరాడే శక్తి వస్తుందని తెలిపారు. ఈ నెల 30 వరకూ ఈ మహాసభ జరగనుంది. మహాసభలో గ్రూప్ సి సర్కిల్ కార్యదర్శి బి.శ్రీధర్, జిడిఎస్ సర్కిల్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, మహిళా కమిటీ ఛైర్మన్ విజయలక్ష్మి, సేవ్ పబ్లిక్ సెక్టార్ నాయకులు ప్రసాద్‌శర్మ, పెన్షనర్ల సంఘం నాయకులు పద్మనాభ శాస్త్రి, ఎపిఎన్‌జిఓ నాయకులు ఉషారాణి, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రామకృష్ణారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆలోచింపచేసిన విప్లవ గీతాలు

అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం మహాసభ ప్రారంభం సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు జాతీయ, విప్లవ గీతాలను పాడి కార్మికులను దేశ, రాష్ట్ర పరిస్థితులు, అనుసరిస్తున్న విధానాలను ఆలోచింపచేసే విధంగా పాటలు పాడి ఉత్తేజపరిచారు. పాటలు పాడిన వారిలో ప్రజానాట్యమండలి నాయకులు, కళాకారులు ఈ.రాజు, బసవరాజు, ఆశన్న, బతుకన్న, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

విప్లవ గీతాలను ఆలపిస్తున్న పిఎన్ఎం నాయకులు

గురుకులాల్లో మెరుగైన విద్య

- పరీక్ష ద్వారా ప్రవేశాలు
- ప్రజాశక్తితో ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/క్రైం

గురుకులాల్లో మెరుగైన విద్య అందిస్తున్నా మని, మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామని ఎపి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎపిఎస్‌డబ్ల్యు ఆర్ఇఐఎస్) ఉమ్మడి కర్నూలు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా గురుకులాల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...

ఉమ్మడి జిల్లాలో ఎన్ని గురుకులాలున్నాయి? ఎంత మంది విద్యార్థులున్నారు?

కో-ఆర్డినేటర్ : కర్నూలు, నంద్యాల రెండు జిల్లాలు కలిపి 15 అంబేద్కర్ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో బాలురు కోసం 5 పాఠశాలలు, బాలికల కోసం 10 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో డోన్‌లో ఉన్నది ఈ ఏడాది ఏర్పాటవుతోంది. మిగిలినవన్నీ అప్‌గ్రేడెడ్ పాఠశాలలే. కొత్త పాఠశాల మినహా మిగతా వాటిలో 640 మంది విద్యార్థులు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలు ఎలా కల్పిస్తారు?

కో-ఆర్డినేటర్ : ప్రవేశ పరీక్ష ఆధారంగా గురు కులాల్లో ప్రవేశాలు ఉంటాయి. ఐదో తరగతిలో ప్రవేశం కోసం, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ప్రధానంగా ప్రవేశ పరీక్ష ఉంటుంది. 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీలు ఉంటే వాటికి ప్రత్యేకంగా ప్రవేశ పరీక్ష పెట్టి ప్రవేశాలు కల్పిస్తారు.

విద్యార్థులకు ఎలాంటి సదుపాయాలు అందిస్తారు?

కో-ఆర్డినేటర్ : ప్రభుత్వ పాఠశాలల్లో అందించే జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తాం. ప్రత్యేక డైట్ అందిస్తాం. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్స్ ఇస్తాం. వారంలో రెండు సార్లు చికెన్ పెడుతున్నాం. ఇటీవలే డైట్ ఛార్జీలు పెంచారు. పదో తరగతి వరకూ ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1400 చొప్పున, ఇంటర్ విద్యార్థులకు నెలకు రూ.1600 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

పది, ఇంటర్‌లో ఈ సారి ఎలాంటి ఫలితాలు వచ్చాయి ?

కో-ఆర్డినేటర్ : పదో తరగతిలో 83 శాతం, ఇంటర్‌లో 76 శాతం ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలో పదిలో ఐదో స్థానంలో, ఇంటర్‌లో మూడో స్థానంలో ఉన్నాము. కర్నూలు జిల్లాలో ఏడు పాఠశాలలు ఉండగా పదో తరగతి పరీక్షల్లో సరాసరిన 80.99 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఆదోని గురుకుల పాఠశాలలో అత్యధికంగా 98.68 ఉత్తీర్ణత శాతం నమోదయింది. నంద్యాల జిల్లాలో ఆరు పాఠశాలలు ఉండగా పదో తరగతి ఫలితాల్లో సరాసరిన 84.26 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అత్యధికంగా లక్ష్మాపురం గురుకుల పాఠశాల 96.20 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసుకుంది. ఇంటర్మీడియట్‌లో కర్నూలు జిల్లాలో ఐఐటి గురుకుల కళాశాల ఎంపిసి, బైపిసి గ్రూపుల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించింది.

సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నారా?

కో-ఆర్డినేటర్ : పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించడానికి పార్ట్‌టైం టీచర్లను తీసుకోవాలనేది ప్రణాళిక. ప్రస్తుతం రెగ్యులర్ టీచర్ల బదిలీలు జరుగుతున్నాయి. బదిలీలు ముగిసిన తరువాత పార్ట్‌టైం టీచర్లను తీసుకుంటాం.

ఉత్తీర్ణత పెంచేందుకు చర్యలేమైనా తీసుకున్నారా?

కో-ఆర్డినేటర్ : ఎస్ఎస్‌సి అడ్వాన్స్ సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. పదో తరగతిలో ఉత్తీర్ణులు కాని వారి కోసం వాటిలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాము. చిన్నటేకూరు, డోన్‌లో ఆ శిబిరాలు నడుస్తున్నాయి. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనేదే సంస్థ లక్ష్యం. నీట్ మెడిసిన్‌లో 25 సీట్లు, ఐఐటిల్లో 35 నుంచి 40 సీట్లు సాధిస్తామని కూడా ఆశిస్తున్నాం.

విద్యార్థులకు చదువులో కాకుండా వేరే వాటిలోనూ అవగాహన కల్పిస్తున్నారా?

కో-ఆర్డినేటర్ : క్రీడల్లో కూడా గురుకుల విద్యార్థులకు శిక్షణ ఉంటుంది. నేషనల్ లెవర్ వరకూ కూడా విద్యార్థులు రాణిస్తున్నారు. ఆరోగ్యం పరంగా కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎయిడ్స్ నివారణ దినోత్సవం, టిబి నివారణ దినోత్సవం, మలేరియా దినోత్సవం వంటి ముఖ్యమైన రోజులు, చేతుల శుభ్రత దినోత్సవం, డీ వార్మింగ్ డే వంటి దినాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

సిఎం పర్యటన తేది మార్పు

జూన్ 1న పత్తికొండలో ముఖ్యమంత్రి సభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పత్తికొండకు ఈ నెల 30న రావడానికి బదులు జూన్ ఒకటవ తేదీకి మార్పు అయినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు.. అనివార్య కారణాల వల్ల ఈ మార్పు జరిగిందని, ముఖ్యమంత్రి జిల్లా పర్యటన మార్పు జరిగిందని కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు. అని శాఖల అధికారులు మార్పును గమనించి ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

కోల్సు కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విలువలతో కూడిన విద్యతో ఉన్నత స్థితికి

-మదనపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

-కోల్సు కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దశాబ్దాల పాటు ఎంతోమందిని రాజకీయ ,విద్యా ,సాంస్కృతిక, ప్రభుత్వ రంగాల్లో ఉన్నత స్థాయికి చేర్చిన ఘనత కోల్స్ కళాశాలదని పూర్వ విద్యార్థి మదనపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి .వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. కోల్స్ కళాశాల 1988-1990 ఆర్ట్స్ బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా ఆదివారంకర్నూల్ నగరంలోని శ్రీలక్ష్మి కళ్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోల్స్ కళాశాలలో విలువలతో కూడిన విద్యను అందించినందు వల్లనే మనమందరం ఉన్నత స్థితిలో ఉన్నామని అన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా తల్లిదండ్రులను, గురువులను మరచిపోకూడదని చెప్పారు. కోల్స్ కళాశాల ప్రిన్సిపల్ ఝాన్సీ రాణి మాట్లాడుతూ ఈ కళాశాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. పలువురు లెక్చరర్లు, పూర్వ విద్యార్థులు అనేక విషయాలను ప్రస్తావించారు. సీనియర్ జర్నలిస్ట్ సాయికుమార్ మాట్లాడుతూ గురువు లేనిదే మనిషి లేడన్నారు. ప్రశ్నలు అడుగుతున్నారనే భయంతో వెనుక బెంచీలో కూర్చున్న సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. నాయకత్వ విలువలను ఇదే విద్యాలయం నుంచి నేర్చుకున్నానని అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల జ్ఞాపికలు అందజేశారు. 33 ఏళ్ల తర్వాత అపూర్వ కలయికతో పాటు, ఆనాటి గురువులను సాదరంగా గౌరవిస్తూ అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొన్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని సంబరపడ్డారు.

పదోన్నతులను మాన్యువల్ విధానంలోనే జరపాలి: ఫ్యాప్టో

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డిఇఒ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల నిరసన

ఉపాధ్యాయుల పదోన్నతులను మాన్యువల్ విధానంలో జరపాలని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్ గోకారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు ,ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, ఫ్యాప్టో రాష్ట్ర కో ఛైర్మన్ ప్రకాష్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.హృదయ రాజు మాట్లాడారు. జాతీయ విద్యా విధానం అమలులో 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన సందర్భంగా రాష్ట్రంలో 34 వేల ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. చివరికి 11000 అని మాట మార్చి, తీరా చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా గత అక్టోబర్లో 5800 మాత్రమే చేసిందన్నారు. అనేక ఎస్‌జిటి పోస్టులను రద్దుచేసి, బదిలీలు పదోన్నతుల జరిపే నిమిత్తమై గత అక్టోబర్‌లో ఉపాధ్యాయుల నుంచి విల్లింగ్ నాన్ విల్లింగ్ తీసుకున్నారన్నారు. జిఒ నెం.187 లో ఉన్న అసంబద్ధాలపై వేల కొలది ఉపాధ్యాయులు కోర్టు మెట్లక్కడంతో బదిలీలు పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయిందని అన్నారు. ఉపాధ్యాయులకు పని సర్దుబాటు పదోన్నతుల పేరుతో నెలకు 2500 చెల్లిస్తామని చెప్పి చాగలమర్రి నుండి హోలగుంద ప్రాంతాలకు సుమారు 200 కిలోమీటర్ల సుదూర ప్రాంతాలకు నిర్బంధంగా దుర్మార్గంగా ఉపాధ్యాయులతో పని చేయించుకున్నారన్నారు. విద్యాశాఖ మంత్రితో జరిగిన చర్చలలో పదోన్నతులను మాన్యువల్‌గా జరుపుతామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఉన్నతాధికారులు పదోన్నతులను ఆన్లైన్ చేయుటకు ఏర్పాటు చేస్తున్నారని ఇది సరికాదని అన్నారు. బదిలీలతో పాటు పదోన్నతులు వెబ్ ఆప్షన్లను ఇచ్చుకోవడంలో ఒక్కో ఉపాధ్యాయుడు సుమారుగా 1000 ఆప్షన్లను ఇచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే సర్వీస్ నిబంధనల మేరకు వారికి రెండు ఇంక్రిమెంట్లతో కూడిన పదోన్నతులను కల్పించి, పదోన్నతులను మాన్యువల్ విధానం ద్వారానే జరపాలన్నారు. జీవో నెంబర్ 47లో ఉన్న అసంబద్ధాలను తొలగించాలన్నారు. బదిలీలలో అన్ని ఖాళీలను చూపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అవసరమైతే బదిలీలు పదోన్నతుల ప్రక్రియను అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఫ్యాప్టో ఛైర్మెన్ మాధవ స్వామి, యుటిఎఫ్ నుండి నవీన్ పాటి, మద్దిలేటి ఎస్‌టియు నుండి టికె. జనార్ధన్, ప్రసన్న రాజు, ఎపిటిఎఫ్ 257 నుండి రంగన్న, నాగరాజు, రవికుమార్, ఎపిటిఎఫ్ 1938 నుండి ఇస్మాయిల్, మరియానందం, డిటి.యాఫ్ నుండి రత్నం యేసోపు, బిటిఎ నుండి భాస్కర్, సుధాకర్, ఆప్టా నుండి మధుసూదన్ రెడ్డి, రాజు సాగర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

ఆత్మ రక్షణకు కరాటే సాధన అవసరం

బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో జిల్లా ఉషు సంఘం ఛైర్మన్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

యూనివర్సల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించినట్టు డైరెక్టర్ టి.శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉషు సంఘం ఛైర్మన్ డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ క్రీడాకారులను అభినందిస్తూ కరాటే ఉషు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల రోగాలను దూరం చేస్తుందని, కరాటే వల్ల ఏకాగ్రత, పట్టుదల, మెమరీ పవర్, సాహసం పెరుగుతుందని, ఆత్మరక్షణకు తోడుపడుతుందని అన్నారు. చిన్నారులు చిన్న వయసులోనే మార్షల్ ఆర్ట్స్ మెంటల్ స్టామినా కూడా పెరుగుతుందని అన్నారు. అనంతరం కలర్ బెల్టులు సాధించిన క్రీడాకారులకు బెల్టులను, సర్టిఫికెట్స్‌ను, ఫలహారాలు అందజేశారు. డైరెక్టర్ టి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ బెల్ టెస్ట్‌లో 29 మంది చిన్నారులు పాల్గొన్నారని తెలిపారు. ఎగ్జామినర్లుగా అమ్ముతీశ్వర్, చిన్న, శ్రీనివాసులు , సుధాకర్ క్రాంతి, చిరంజీవులు, ఝాన్సీ లేకశ్రీ పాల్గొన్నారని మాస్టర్ టి.శ్రీనివాసులు తెలిపారు.

చిరస్మరణీయుడు ఎన్‌టిఆర్

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

సినీ రాజకీయ రంగాల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సృష్టించుకున్న నందమూరి తారక రామారావు చిరస్మరణీయుడని పారిశ్రామికవేత్త స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బివి. రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక టీజీవి కళాక్షేత్రంలో ఎన్‌టిఆర్ శతాబ్ది ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి బివి. రెడ్డితో పాటు రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య మంత్రాలయం మఠం పరిపాలన అధికారి మాధవ శెట్టి పుష్పమాలను సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పత్తి ఓబులయ్య రచించిన తెలుగు బోజుడు మూడవ ముద్రణ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బివి.రెడ్డి మాట్లాడుతూ 1982లో తెలుగుదేశం పార్టీలో చేరిన మొదటి రాజకీయవేత్తగా జిల్లాలో తనకు స్థానం ఉందని అప్పటి టిడిపి కేంద్ర కమిటీలో తాను సభ్యుడిగా పనిచేశానని, ఎన్‌టిఆర్‌తో తనకు ఎన్నో అనుభవాలు ఉన్నాయన్నారు. ఆయన పోషించిన రాముడు, కృష్ణుడు, దుర్యోధనుడు వంటి పాత్రలు ప్రేక్షకులు ఎన్నటికీ మరచిపోలేరని తెలిపారు. తెలుగు పూజలు గ్రంథంలోని పద్యాలను కె.బాల వెంకటేశ్వర్లు, మహమ్మద్‌మియా మధురంగా పాడి వినిపించారు. అనంతరం నాట్య ఆచార్య కరీముల్లా శిష్యబృదం అలనాటి ఎన్‌టిఆర్ చిత్రాల్లోని పాటలకు నృత్యంతో కనువిందు చేశారు. కార్యక్రమంలో సంగా ఆంజనేయులు, రాజు తదితరులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. కవులు కళాకారులను బివి.రెడ్డి, జి పుల్లయ్య మాధవశెట్టి సత్కరించారు. తెలుగు భోజుడు రచయిత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ 1986లో ఎన్‌టిఆర్‌తో అలాగే మూడో ముద్రలను ప్రస్తుతం ఆవిష్కరించడం తనకు సంతోషంగా ఉందన్నారు. రామారావు జీవిత చరిత్ర పద్య రూపంలో ఉందన్నారు.

ఎన్‌టిఆర్‌కు నివాళ్లు అర్పిస్తున్న జి.పులయ్య, పత్తిఓబులయ్య , తదితరులు

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి- సి బెళగల్



బెళగల్ లోని ఎన్‌టిఆర్ పార్కులో టిడిపి మండల కన్వీనర్ గోవింద్ గౌడ్ ఆదివారం మండల నాయకులు, కార్యకర్తలు సమక్షంలో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పంపిణి చేశారు.మాజీ కన్వీనర్ పాండురంగన్న గౌడ్, మాజీ సర్పంచ్ చిన్న మునెప్ప, ధనుంజయపాల్గొన్నారు.

మద్దికేర : మద్దికేరలో కేక్ కట్ చేసి ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు టిడిపి అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ శివప్రసాద్ యాదవ్, మద్దికేర టౌన్ అధ్యక్షులు గడ్డం రామాంజనేయులు పాల్గొన్నారు.

అంచలంచెలుగా.. గుమ్మనూరు నారాయణ

- గుర్తింపుగా వరించిన మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి- నేడు అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం

ప్రజాశక్తి - చిప్పగిరి

సాధారణ పార్టీ కార్యకర్తగా జీవితం ప్రారంభించిన గుమ్మనూరు నారాయణ అంచలంచెలుగా ఎదిగారు. పార్టీలో చేసిన సేవలకు గుర్తింపు గా మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని అందించారు. మంత్రి గుమ్మనూరు జయరాంకు చిప్పగిరి మండలంలో అండగా ఉంటూ పార్టీకి ఎనలేని సేవలు అందించారు. 2014 ఎన్నికలలో గుమ్మనూరు జయరాం ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ ప్రతిపక్షంలో ఉండడం వలన కష్టకాలంలో పార్టీ క్యాడర్‌కు అండగా నిలిచారన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు తోడు నీడగా నిలబడ్డారు.

స్థానిక ఎన్నికలలో చక్రం తిప్పిన నారాయణ

వైసీపీ మండల కన్వీనర్‌గా గత స్థానిక ఎన్నికలలో వైసిపి అభ్యర్థులను ఏకగ్రీవం ఎన్నిక అయ్యేందుకు తన వంతు కృషి చేశారు. మంత్రి జయరాం సహకారంతో 10 ఎంపీటీసీలకు గాను 8, గ్రామ పంచాయతీల 13కు గాను 10 ఏకగ్రీవం చేయించారు. తన స్వగ్రామం గుమ్మనూరులో నారాయణ తన తల్లి లక్ష్మీదేవిని పోటీ చేసి ఏకగ్రీవం చేయించారు. ప్రభుత్వం, మండలంలో పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేస్తూ ముందుకు వెళ్తున్నారు.

ఆపదలో ఉన్న వారికి సాయం చేస్తూ..

మండలంలో ఏ గ్రామం వారు అయిన తమకు ఇబ్బందిగా ఉందని తన ఇంటి దగ్గరకు వచ్చి అడిగితే తనకు తోచిన సాయం చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యము, ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలకు అండగా నిలబడుతున్నారు. గ్రామాలలో దేవాలయం నిర్మాణాలకు ఎవరైనా సహకారం అడిగితే తన వంతు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారు. మండల కేంద్రమైన చిప్పగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదురుపేనా బహుమతులు ఇస్తున్నారు. గ్రామీణ క్రీడా పోటీలకు యువతకు ప్రోత్సాహం కల్పిస్తూ తన వంతు ఆర్థిక సహకారం అందిస్తున్నారు.

నేడు అట్టహాసంగా ప్రమాణ స్వీకారం

ఆలూరు మార్కెట్ యార్డ్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం మార్కెట్ యార్డు ప్రక్కన ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో జరుగునుంది. మార్కెట్ యందు ప్రమాణస్వీకారానికి మార్కెట్ యార్డ్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రమాణస్వీకారంలో మంత్రి గుమ్మనూరు జయరాంతో పాటు తాలూకాలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరవుతున్నారు.

మంత్రి జయరాంతో గుమ్మరూరు నారాయణ

క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న దృశ్యం

పాండవగల్ పెద్ద చెరువు సమస్యపై

- మూడవరోజు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలం పరిధిలో పాండవగల్ పెద్ద చెరువు సమస్యపై మూడవరోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతూ సాయంత్రం పెద్ద ఎత్తున రాస్తారోకోని నిర్వహించారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కే. లింగన్న మాట్లాడుతూ పెద్ద చెరువును వెంటనే స్వాధీనం చేసుకోవాలని, నిర్లక్ష్యంగా వివరిస్తున్న అధికారులను వెంటనే తొలగించి చెరువు సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు ముందుడు వేయాలని, లేని పక్షంలో గ్రామస్తులను సమీకరించి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించకపోతే గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమాలు ఏమి జరిగినా అడ్డుకుంటామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజల సమస్యల దష్టిలో ఉంచుకొని రాస్తారోకోను విరమించుకున్నారు.

రాస్తారోకో నిర్వహిస్తున్న పాండవగల్ గ్రామ ప్రజలు

పెద్ద చెరువుపై కన్నెత్తి చూడని తహశీల్దార్

గత ఎన్నో ఏళ్లుగా చెరువు సమస్యలపై గ్రామస్తులంతా ఏకమై పోరాడుతున్న స్పందన కార్యక్రమంలో అర్జీలు పెడుతూ, రాస్తారోక, ధర్నా, సీఎం సభను అడ్డుకుంటూ హెచ్చరించిన, పాదయాత్రలు, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాలిచ్చినా ఆదోని తహసిల్దార్ వెంకటలక్ష్మి మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువును అనాధికారికంగా స్వాధీనం చేసుకోవాలనుకుంటున్న వ్యక్తికి వత్తాసు పలుకుతూ ఆమె విధులు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కనీసం ఒక్కసారి కూడా తహశీల్దార్ పెద్ద చెరువు సందర్శించిన దాఖలు లేవని, కార్యాలయం ముందు నిరసన,రాస్తారోక రాష్ట్ర చేపడితే మాత్రం పాండవగల్ గ్రామ ప్రజలపై విరుచుకుపడుతూ దుర్భాషలకు దిగుతున్నారని గ్రామస్తులు తెలిపారు. కోర్టులో ఉన్న విషయాన్ని తాహశీల్దార్ తెలిసినప్పటికీ కోర్టు వాయిదాలకు పోకుండా, సరైన పత్రాలు దాఖలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు అన్నారు.

మూడవరోజు రిలే నిరాహార దీక్షలు : మండలం పరిధిలో పాండవగల్ పెద్ద చెరువు సమస్యపై మూడవరోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. దీక్షలను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి రామాంజనేయులు, పాండవగల్ గ్రామ సర్పంచ్ కె ఉమాదేవి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు రామాంజనేయులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశులు, సిపిఎం మండల కార్యదర్శి లింగన్న మాట్లాడుతూ సర్వేనెంబర్ 135లో ఉన్న పాండవగల్లు పెద్ద చెరువు 20 ఎకరాలను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. గత 30 సంవత్సరాలుగా సిపిఎం పార్టీ ఉద్యమిస్తూనే ఉన్నా.. ప్రభుత్వాలు కానీ ప్రజా ప్రతినిధులుగాని చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా వెంటనే హైకోర్టులో పెండింగ్లో ఉన్న కేసును వెంటనే పరిష్కరి ంచాలని డిమాండ్ చేశారు. పెద్ద చెరువును స్వాధీనం చేసుకునే అంతవరకు సిపిఎం తన పోరాటాన్ని కొనసాగి స్తుందని అన్నారు. మూడవరోజు నిరాహార దీక్షల్లో సిపిఎం మండల నాయకులు జే రామాంజనేయులు, సిపిఎం శాఖ కార్యదర్శులు గోవిందు, అనీఫ్ బాషా, సిపిఎం సభ్యులు 9వ వార్డు నెంబర్ కే కృష్ణ, 4వ వార్డ్ సభ్యులు ఎస్. మా బాష, సిపిఎం సానుభూతిపరులు, ఆంజనేయ, యు.పరశురాం,డివైఎఫ్ఐ నాయకులు భాస్కర్, మంజు నాథ, రమేష్ కూర్చున్నారు. పార్టీ శాఖ కార్యదర్శి కే పాండురంగ, పార్టీ మహిళా శాఖ కార్యదర్శి నరసమ్మ, పార్టీ సభ్యులు మునెమ్మ, తాయమ్మ, భవాని,తిమ్మక్క, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు

దళిత కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని బసరకోడు గ్రామంలోని దళిత కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఉచిరప్ప, కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, తిక్కప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. దళిత కాలనీలో సంవత్సరాల నుండి వీధుల్లో డ్రైనేజీ,సిసి రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సమస్య పట్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఎన్నోసార్లు అధికారులకు విన్నవిచ్చిన పట్టించుకునే నాధుడే లేరని అన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి బసరకోడు గ్రామంలో దళిత కాలనీలో డ్రైనేజీ కాలువలు, సిసి రోడ్లు, త్రాగినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి డివైఎఫ్ఐ, కెవిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన పూలుకుంటామని తెలియజేశారు. నాయకులు రామాంజనేయులు, హుసేని, రామప్ప పాల్గొన్నారు.

3 నుండి టెన్నిస్ బాల్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని ఇంగలదహల్ గ్రామంలో కె.సి.తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం జూన్ 3వ తేదీ నుండి ప్రారంభిస్తున్నామని కె.సి.టి.ఆర్ ఆర్గనైజర్లు ఎంపీటీసీ మల్లికార్జున, పి.హుసేన్, బి.తిమ్మప్ప,విరేష్‌లు ఆదివారం తెలిపారు. మొదటి బహుమతి రూ.50,000, రెండవ బహుమతి రూ.25000లతో పాటు ట్రోఫీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జట్ల పేర్లను ఈనెల 31లోపు నమోదు చేసుకోవాలని, వివరాలకు 78935872 55,8499947028,9110301890 నంబర్లను సంప్రదించాలన్నారు.

పురుగుల మందు తాగి భార్య మృతి

- ఆవేదనతో భర్త రైలు కిందపడి ఆత్మహత్య
- తల్లిదండ్రులు కోల్పోయి అనాధగా మిగిలిన బాలుడు

ప్రజాశక్తి- దేవనకొండ

కడుపునొప్పి తాళలేక వివాహిత మహిళ పురుగుల మందు సేవించడంతో చికిత్స పొందుతూ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో కోలుకోలేక మృతి చెందింది. భార్య మృతిని జీర్ణించుకోలేని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవనకొండ మండలంలోని గుడిమిరాళ్ల గ్రామానికి చెందిన బోయ ముసలి రాముడు కుమారుడైన రంగ నాయకులు పత్తికొండ మండలం చిన్నహుల్తి గ్రామానికి చెందిన లతతో 18 నెలల క్రితం వివాహమైంది. శనివారం నాడు కడుపునొప్పి తాళలేక లత(22) పురుగుల మందు సేవించింది. విషయం తెలుసుకున్న భర్త, కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందింది. భార్య మృతిని జీర్ణించుకోలేని మృతరాలి భర్త రంగనాయకులు (28) కర్నూల్ సమీపంలోని దూపాడు రైల్వే స్టేషన్ దగ్గర రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతులకి 10 నెలల పసి బాలుడు ఉన్నాడు. పసితనములోని ఏమి తెలియని ఆ చిన్నారి తల్లిదండ్రులను కోల్పోవడంతో అనాధ అయ్యాడు. ఇరువురు మృతితో కుటుంబ సభ్యులలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇరు కుటుంబాల సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని స్థానిక పోలీసులు తెలిపారు.

లత(ఫైల్ ఫోటో)

రంగనాయకులు (ఫైల్

28 ఏళ్ల పోరాటానికి ఫలితం

- భర్త ఉద్యోగ సర్వీస్ హక్కుల కోసం పోరాడి గెలిచిన వృద్ధురాలు
- 78 వయస్సులోనూ పోరాటం ఆపలేదు

ప్రజాశక్తి-ఆలూరు

ఆమె వయస్సు 78 ఏళ్లు. ఓపక్క భర్త చనిపోయిన భారం. మరోపక్క ఆర్థిక భారం. ఇంకొపక్క వృధ్యాప్య భారం. ఇన్ని భారాలు తట్టుకొని తన భర్త ఉద్యోగ సర్వీస్ హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసి విజయం సాధించింది ఆలూరు పట్టణానికి చెందిన లేపాక్షమ్మ. వృద్ధాప్యం పైబడి నడిచేందుకు ఇబ్బందిగా ఉన్నా.. తన సోదరుడు రిటైర్డ్ హెచ్‌ఎం గురుమూర్తి సహకారంతో 28 ఏళ్లుగా లేపాక్షమ్మ ప్రభుత్వంతో పోరాటం చేసింది. ఆమె సుదీర్ఘ పోరాటానికి ప్రభుత్వం అరియర్స్, పెన్షన్ మంజూరు చేసింది. వివరాలోకెళ్ళితే.. 1970లో ఆలూరులో ఓ హత్య కేసులో లేపాక్షమ్మ భర్త నీలకంఠయ్యతో పాటు ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులకు హైకోర్టు 3 ఏళ్ళు జైలు శిక్ష విధించింది. శిక్ష కాలం పూర్తయిన తరువాత తమ ఉపాధ్యాయ పోస్టులను తిరిగి ఇవ్వాలని నీలకంఠయ్య, బూర్ల సోమన్న కలిసి జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర అధికారికి అర్జీ పెట్టుకోగా రూల్ 4 ప్రకారం నేరం చేసినందుకు ఉద్యోగం ఇవ్వకూడదని 1976 ఆగస్టు 16న తెలిపారు. ఇదే కేసు కడపలో జరిగిన సంఘటనలో తమ ప్రభుత్వ పోస్టును తిరిగి ఇచ్చిన సమాచారాన్ని తీసుకొని 1989 సెప్టెంబర్ 1న రాష్ట్ర అడ్మినిస్ట్రేషన్ కోర్టులో రిట్ వేశారు. ఆ క్రమంలోనే బూర్ల సోమన్న మృతి చెందాడు.బ 1995 డిసెంబర్ 15న కోర్టు న్యాయమూర్తి రెండు వారాల్లో నీలకంఠయ్య కు ఉద్యోగం ఇచ్చి బూర్ల సోమన్న భార్యకు న్యాయం చేయాలని తీర్పునిచ్చింది. నీలకంఠయ్యకు షోకాజ్ నోటీస్ ఇస్తూ ఆర్థికపరమైన గ్రాజ్యుటి పెన్షన్ 100 శాతం కట్ చేస్తూ జైలు నుండి విడుదలైన రోజు నుండి ఉద్యోగంలో కొనసాగిస్తున్నట్లు 1996 జూన్ 30న రిటైర్డ్ చేసిన్నట్లు నోటీస్‌లో తెలిపారు. నీలకంఠయ్య సర్వీస్ హక్కులు, పెన్షన్ ఇవ్వాలని కోరగా 2003లో ఇవ్వడానికి లేదని అధికారులు తెలిపారు. దీనితో ఉద్యోగం రాక, సర్వీస్ హక్కులు, పెన్షన్ రాకపోవడంతో మనోవేదనతో నీలకంఠయ్య 2004 ఆగస్టులో మృతి చెందారు. 1995లో రాష్ట్ర అడ్మినిస్ట్రేషన్ కోర్టు న్యాయమూర్తి నీలకంఠయ్యకు ఉద్యోగం ఇవ్వాలని తీర్పునిచిన్నా.. అధికారుల తప్పిదాలతో ఇవ్వకపోవడం, భర్త చనిపోవడం తో లేపక్షమ్మకు నలుగురి కుమారులో ఇద్దరు మృతి చెందారు. మరొకరు బొంబాయికి వలస వెళ్ళిరాలేదు. ఒకరు వికలాంగుడు, ఇద్దరు కుతుర్లకు పెళ్లిళ్ల కాగా మరో కూతురు మానసిక రోగి ఇన్ని సమస్యలతో ఆర్థిక ఇబ్బందులతో తన భర్త చేసిన ఉద్యోగ సర్వీస్ హక్కుల కొరకు సుదీర్ఘ పోరాటం చేసింది లేపాక్షమ్మ. చివరికి భర్త సర్వీస్ హక్కుల ఆరియర్స్ రూ.15లక్షల 65,319 నెల వారీగా రూ.13,540 పెన్షన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. లేపాక్షమ్మ,సోదరుడు గురుమూర్తి పోరాట పటిమను ఆలూరు ప్రజలు ప్రశంసించారు.

లేపాక్షమ్మ

మాట్లాడుతున్న వైసీపీ కన్వీనర్ మల్లికార్జున

ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - దేవనకొండ

జూన్ 1న పత్తికొండలో జరిగే ముఖ్యమంత్రి సభను మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, రైతులు, మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, జడ్పిటిసి సభ్యులు రామకృష్ణ, ఎంపీపీ భర్త లుముంబా కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీకి ముఖ్యమంత్రి జగన్ ప్రమాణ స్వీకారం చేసి నాలుగు సంవత్సరాలు అవుతుందని, రైతు రాజ్యం ఏర్పడి నాలుగు సంవత్సరాలు అవుతున్నందున రైతులకు ఇదేరోజున రైతు భరోసా పంపిణీ చేసి రైతులపై ఉన్న అభిమానాన్ని ప్రభుత్వం చూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అరుణ్ కుమార్, వైసిపి నాయకులు చంద్రన్న, రామాంజనే యులు, బాబు, కో ఆప్షన్ సభ్యులు జుబేర్ సాహెబ్ , ఎంపీ టీసీ మహేష్ వైసీపీ నాయకులు తిరుమలేష్, రాఘవేంద్ర, బజారి, రంగన్న, మహాలింగడు, పరమేష్, లింగన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు దుబాయ్ నుండి ఇండియాకు ఆదోని యువకుడు

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయి ఇరుక్కున్న ఆదోని యువకుడు ఇమ్రాన్ ఎట్టకేలకు గల్ఫ్ బాధితుల రక్షణ సంఘం సహకారంతో ఎట్టకేలకు ఇండియా బయలు దేరాడు. శనివారం గల్ఫ్ బాధితుల రక్షణ సంఘం అధ్యక్షుడు గుండెపల్లి నరసింహ, మిత్రుడు గౌస్ బాష ఏజెంట్ తో ఉన్న పాస్ పోర్ట్ ను ఇప్పించి ఇక్కడికి రావడానికి అన్ని ఏర్పాట్లు చేసి విమాన మార్గం ద్వారా పంపారు. గత మార్చి 30న ఉపాధి కోసం నెలకు రూ. రెండు లక్షలు జీతం వస్తుందని ఆశపడి దుబాయ్ కి వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయిన విషయం అందరికి తెలిసిందే. రెండు నెలలపాటు ఏజెంట్ అక్కడ ఉపాధి చూపకుండా క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు లోన్ తీసుకునేందుకు సంతకాలు పెట్టాలని ఒత్తిడి చేయడమే కాకుండా చిత్రహింసలకు గురి చేయడంతో సామాజిక మాధ్యమాల ద్వారా బాధితుడు ఇమ్రాన్ తనను రక్షించాలని కోరారు. దీంతో స్పందించి అక్కడి గల్ఫ్ బాధితుల రక్షణ సంఘం బాధితుడు ఇమ్రాన్ ఉన్నచోటకు వెళ్లి రక్షించి ఆధోనికి పంపించేందుకు విమాన టికెట్లుతో పాటు కొంత ఖర్చులకు ఇచ్చి పంపారు. వారికి, తను రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి బాధితుడు ఇమ్రాన్ వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దుబాయ్ ఎయిర్ పోర్టులో ఇండియాకు వస్తున్న ఆదోని యువకుడు ఇమ్రాన్

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో గత నెలరోజుల క్రితం హఠాత్మమరణం చెందిన కురువ శ్రీనివాసులు కుటుంబానికి అతని స్నేహితులు 2004–05 టెన్త్ క్లాస్ బ్యాచ్ ఆదివారం నాడు ఆర్థిక సాయం అందజేశారు. కురువ శ్రీనివాస్ భార్య కూతురు పేరు పైన రూ.50వేల నగదు ఫిక్స్ డిపాజిట్ బాండ్ అందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, పరమేష్, సత్య, కాశీం, వెంకటరామప్ప, పకీరప్ప, లింగన్న, స్నేహితులు బృందం పాల్గొన్నారు. స్నేహితుల బృందానికి శ్రీనివాసులు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితుల బృందం

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఆవు మృతి, ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలో ఆర్‌టిసి బస్సు, ఆటో ఢీకొని ప్రమాదం జరిగిది. ఈ ఘటనలో ఆవు మృతి చెందగా, ఇద్దరికి గాయాలు అయ్యాయి. వివరాల మేరకు.. దేవనకొండ మండలం బండగట్టు గ్రామానికి చెందిన చిన్న నాగన్న తన ఆవును అమ్మడానికి ఎమ్మిగనూరు పశువుల మార్కెట్‌కి ఆటోలో ఆవును తీసుకువచ్చాడు. ఆవుకు సరైన రేటు రాక అమ్మకపోవడంతో తిరిగి ఆటోలో ఆవును తీసుకొని బండగట్టు గ్రామానికే వెళ్తుండగా ఎర్రకోట గ్రామ సమీపంలో కర్నూల్ నుండి బళ్లారికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ కురువ రాముడు, చిన్న నాగన్నలకు గాయాలు కావడంతో ఎమ్మిగనూరు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

మృతి చెందిన ఆవు

శ్రీమఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మంత్రాలయం చేరుకున్న భక్తులు పవిత్ర తుంగభద్రానదిలో పున్య స్నానాలు చేసి గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం బందావన ప్రతిమను స్వర్ణ పల్లకీలో ఉంచి వేద మంత్రాలతో మంగళ వాయిద్యాలు నడుమ శ్రీ మఠం ప్రాకారంలో భక్తులతో మోయించి పల్లకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీమఠం సహాయక పిఆర్వో హెన్నొళ్ళి వ్యాసరాజాచార్, ఇతర మఠం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో భక్తులు

ఘనంగా ఎన్‌టిఆర్ శతజయంతి

ప్రజాశక్తి - ఆదోని

నందమూరి తారకరామారావు శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదోని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆదేశాల మేరకు సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని మంగళ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి, ఎన్‌టీఆర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్న పిల్లల ఆసుపత్రిలో రోగులకు బ్రేడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఉమాపతినాయుడు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాల న్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించడం ఖాయమని, ఆదోనిలోనూ మీనాక్షినాయుడు భారీ మెజారిటీతో గెలవడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు రంగస్వామి నాయుడు మాజీ కౌన్సిలర్ రంగన్న, వాల్మీకి వెంకటేశు, అల్తాఫ్ హుస్సేన్, మల్లికార్జున, కృష్ణారెడ్డి, చాంద్ బాషా, చిన్న, యేసు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు ఉన్నారు.

పట్టణంలోని సిటి ప్రెస్ ఆఫీస్ కాంపౌండ్‌లో టిడిపి నేతలు ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు వడ్డెమన్ గోపాల్, మురళి రాముడు, బిటి శ్రీనివాస్, గిరిధర్, రామకష్ణ, సాధిక్, బద్రి స్వామి, వెంకట రాముడు, శ్రీనివాస్ మాట్లాడారు.

పెద్దకడబూరు: పెద్దకడబూరు గ్రామంలోని టిడిపి రైతు రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవరామ కాంత్ రెడ్డి, టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యాయురాలు నరవ శశిరేఖ స్వగృహం నందు ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరవ దంపతుల మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌కి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బస్సుల దొడ్డి, ఈరన్న, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసు, బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున, నాయకులు మీ సేవ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. **ఆస్పరి:** పేద ప్రజల పక్షపాతి దివంగనేత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అన్ని సొసైటి మాజీ డైరక్టర్ క్రిష్ణ, సీనియర్ నాయకులు తిమ్మన్న, రామచంద్ర రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీ రహంతుల్లా అన్నారు. ఆస్పరిలోని స్థానిక గాంధీ పార్క్ వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. టీడీపీ నాయకులు భద్రి,ఈశ్వర్, నాగన్న,యూత్ కన్వీనర్ రాఘవేంద్ర, సతీష్,మహేష్, తాయన్న, రాఘవేంద్ర,రాజు, వెంకటేష్, నాగేంద్ర, అక్బర్, నరేష్, వీరేష్, మహేష్, మరేష్,అర్జున్ పాల్గొన్నారు.

కోట్ల క్యాంపు కార్యాలయంలో ..

ఎమ్మిగనూరు రూరల్: స్థానిక కోట్ల క్యాంపు కార్యాలయం నందు ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి టిడిపి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు పార్టీలో చోటు కల్పించి మహానేత ఎన్‌టిఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బనవాసి ఆదినారాయణ రెడ్డి, కదిరికోట ఆదెన్న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, ఎమ్మిగనూరు మండలం మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, తెలుగు మహిళా నాయకురాలు గోకారమ్మ, టిడిపి సీనియర్ నాయకులు కోడిగంటి శంకరన్న, తదితరులు పాల్గొన్నారు.

కోట్ల క్యాంపు కార్యాలయంలో ..

ఆదోని : ఉమాపతినాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నేతలు

ఆదోని : సిటి ప్రెస్ ఆఫీస్ కాంపౌండ్‌లో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

పెద్దకడబూరు: ఎన్‌టిఆర్ చిత్ర పటాని ఊరేగిస్తున్న టిడిపి నేతలు

అట్టహాసంగా.. ఎఐపిఇయు ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహాసభ

- దేశభక్తి పేరుతో బిజెపి ఆర్ఎస్ఎస్ దోపిడీ : సిహెచ్.నరసింగరావు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం (ఎఐపిఇయు) పోస్ట్‌మెన్ మరియు ఎంటిఎస్ 3వ ద్వైవార్షిక రాష్ట్ర మహాసభ కర్నూలు నగరంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. బిఎఎస్ కళ్యాణ మండపంలోని ఎన్ఎస్ మూర్తి సభా ప్రాంగణంలో మహాసభ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను సిహెచ్.నరసింగరావు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ (ఎన్ఎఫ్‌పిఇ) జెండాను ఎఐపిఇయు సర్కిల్ కార్యదర్శి సిహెచ్.విద్యాసాగర్ ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. సంతాప తీర్మానాన్ని విద్యా సాగర్ ప్రవేశపెట్టారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి పేరుతో బిజెపి, ఆర్ఎస్ఎస్ దేశ సందపను దోచుకుంటున్నాయన్నారు. మోడీ విధానాలనే రాష్ట్రంలో జగన్ అమలు చేస్తున్నారని, రాష్ట్రంలో మూడు పార్టీలూ మోడీకి తలవంచి ఆ విధానాలనే అమలు చేస్తున్నారని తెలిపారు. సీక్రెట్ బ్యాలెట్ ద్వారానే సంఘాల గుర్తింపును నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పి3 యూనియన్ గుర్తింపు రద్దుకు వ్యతిరేకంగా అందరూ పోరాడాలన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చా రని, అవి అమలైతే కార్మికులను బానిసల కంటే హీనంగా చూస్తారని చెప్పారు. తపాలా శాఖను ప్రయివేటీకరణ చేసేందుకు పోస్టల్ కార్పొరేషన్‌గా మార్చేందుకు ప్రభుత్వం కుట్ర చేసిందని, తీవ్ర పోరాటాలతో వెనక్కి తగ్గిందని తెలిపారు.

బిజెపిని ఇంటికి పంపాలి : ఎంఎ.గఫూర్

పాత పెన్షన్ విధానం అమలు, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వరంగాన్ని రక్షించుకోవడం కోసం, మతం పేరుతో చేస్తున్న కుట్రలను వ్యతిరేకించేలా బిజెపిని ఇంటికి పంపడం కోసం పని చేయాలని సిఐటియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను, కార్మికులను చైతన్యవంతం చేయాలని పేర్కొన్నారు. పార్లమెంట్ ప్రారంభాన్ని చూస్తే మత ప్రాదిపదికన పాలన నడుస్తోందని అనిపిస్తోందన్నారు. దేశం మతరాజ్యం కాదన్నారు. దేశంలో పోరాడే కార్మిక సంఘాలు లేకుండా చేయాలని బిజెపి ప్రయత్నాలు చేస్తోందని, ఆ ప్రయత్నాలు ప్రతిఘటించకపోతే నష్టపోతామని తెలిపారు.

కార్మిక హక్కులు, భద్రత కోసం పోరాడాలి : పినాకపాణి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికుల హక్కులు, భద్రత కోసం పోరాటాలు చేయాలని విరసం నేత పినాకపాణి పిలుపునిచ్చారు. కార్మికులు బలమైన చైతన్యంతో పోరాటాలు చేయాలని పేర్కొన్నారు. తపాలా ఉద్యోగులు అనుకోకుండా కార్మికులను అనుకున్నప్పుడే పోరాడే శక్తి వస్తుందని తెలిపారు. ఈ నెల 30 వరకూ ఈ మహాసభ జరగనుంది. మహాసభలో గ్రూప్ సి సర్కిల్ కార్యదర్శి బి.శ్రీధర్, జిడిఎస్ సర్కిల్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, మహిళా కమిటీ ఛైర్మన్ విజయలక్ష్మి, సేవ్ పబ్లిక్ సెక్టార్ నాయకులు ప్రసాద్‌శర్మ, పెన్షనర్ల సంఘం నాయకులు పద్మనాభ శాస్త్రి, ఎపిఎన్‌జిఒ నాయకులు ఉషారాణి, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రామకృష్ణారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆలోచింపచేసిన విప్లవ గీతాలు

అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం మహాసభ ప్రారంభం సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు జాతీయ, విప్లవ గీతాలను పాడి కార్మికులను దేశ, రాష్ట్ర పరిస్థితులు, అనుసరిస్తున్న విధానాలను ఆలోచింపచేసే విధంగా పాటలు పాడి ఉత్తేజపరిచారు. పాటలు పాడిన వారిలో ప్రజానాట్యమండలి నాయకులు, కళాకారులు ఈ.రాజు, బసవరాజు, ఆశన్న, బతుకన్న, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఎఐపిఇయు రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్, వేదికపై సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు

పోరాటాలతో ముందుకు..

- బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై అనేక ఆందోళనలు
- సేవా కార్యక్రమాలూ నిర్వహణ
- అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

కేవలం వారి రంగం కోసమే కాకుండా అన్ని ప్రభుత్వ రంగాల రక్షణ కోసం, ప్రజా సమస్యలపైనా పోరాటాలతో ముందుకు సాగిస్తున్నారు అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం పోస్ట్‌మెన్ మరియు ఎంటిఎస్ నాయకులు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై అనేక ఆందోళనలు సాగించారు. సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఆ సంఘం 3వ ద్వైవార్షిక రాష్ట్ర మహాసభ సందర్భంగా ప్రజాశక్తి పలువురు నాయకులను పలకరించింది. వారి పోరాట అనుభవాలు ఇలా...

ప్రజా వ్యతిరేక విధానాలపై..

మొదట నుంచి కేవలం తపాలా శాఖ సమస్యలే కాకుండా ప్రజల సమస్యలపైనా పోరాటాలు చేశాం. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాం. ఢిల్లీలోనూ ఆందోళనలు చేశాం. ఉపాధి హామీ కూలీలు కూలి తీసుకోవడానికి వచ్చినప్పుడు మంచి నీటి సౌకర్యం కల్పించాం. కరోనా సమయంలో నిత్యావసర వస్తువులు, మందులు అందజేశాం. నేను పదేళ్లుగా యూనియన్‌లో ఉన్నాను.

- మహమ్మద్ జానీ, డివిజనల్ అసిస్టెంట్ కార్యదర్శి, కర్నూలు.

పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు

నేను 15 ఏళ్లుగా యూనియన్‌లో ఉన్నాను. కొత్త పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పెద్ద ఎత్తున ఆందోళనలు సాగించాం. 18 నెలల డిఎ బకాయిలు ఇవ్వాలని పోరాటం చేశాం. అధికారుల టార్గెట్ ఒత్తిడికి వ్యతిరేకంగా ధర్నాలు, సమ్మె నిర్వహించాం. మార్చి 28, 29న అన్ని సంఘాలతో కలిసి సమ్మె చేశాం. ఉద్యోగినికి మెడికల్ లీవ్ ఇవ్వకపోతే అధికారిపై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున ధర్నా చేశాం. అధికారుల వేధింపులపై పోరాటం చేశాం. పి3 గుర్తింపు రద్దుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాం.

- ఎ.నాగేశ్వర, డివిజనల్ కార్యదర్శి, అనంతపురం.

1982 నుంచి యూనియన్‌లో..

1982 నుంచి యూనియన్‌లో ఉన్నాను. అన్ని రకాల పోరాటాలూ సాగిస్తున్నాం. పే కమిటీ కోసం 16 రోజుల సమ్మెల చేశాం. నేను చిన్నప్పటి నుంచి విద్యార్థి సంఘంలో ఉండేవాడిని. అలా ఉద్యమాల వైపు ప్రభావితం అయ్యాను. 1982లో జిడిఎస్ ప్యాకర్‌గా చేరాను. అప్పటి నుంచి సంఘంలో ఉన్నా. కేంద్ర, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాం.

- పి.వెంకటేశ్వరరావు, జిడిఎస్ డివిజనల్ కార్యదర్శి, ప్రకాశం.

డివిజన్ కమిటీగా సహకారం..

విజయవాడ రాష్ట్ర కేంద్రం కావడంతో అన్ని ఆందోళనలూ అక్కడ ఎక్కువగా సాగిస్తుంటారు. అక్కడ జరిగే పోరాటాలకు డివిజన్ కమిటీగా సహకారం అందిస్తున్నాం. కరోనా సమయంలో ఇవ్వాల్సిన బకాయిలపై పోరాటాలు సాగించాం. పి3 గుర్తింపు రద్దు చేసిన నేపథ్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాం. కేంద్ర, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు కార్యక్రమాలు చేపట్టాం. నేను ఐదేళ్లుగా యూనియన్‌లో ఉన్నాను.

- ఎం.సుమన్ కుమార్, డివిజనల్ అధ్యక్షులు, విజయవాడ.

నల్లమల ఘాట్‌లో మినీలారీ బోల్తా

ప్రజాశక్తి - మహానంది

నల్లమల ఘాట్ రోడ్డులో అదుపుతప్పి అశోక్ లైలాండ్ వాహనం (మినీలారీ) బోల్తా పడిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు.. నంద్యాల–గిద్దలూరు జాతీయ రహదారి నల్లమల ఘాట్ రోడ్డులో పత్తి లోడుతో గిద్దలూరు వైపు నుంచి నంద్యాలకు వస్తున్న మినీ లారీ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ సమీపంలోని చలమ మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు గంటసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కర్ణాటకకు చెందిన ప్రయాణికులు అటుగా వస్తున్న సమయంలో వారి సహాయంతో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఘటన సమాచారం అందుకున్న మహానంది రోడ్ సేఫ్టీ ఏఎస్ఐ కృష్ణుడు, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు.

గురుకులాల్లో మెరుగైన విద్య

- పరీక్ష ద్వారా ప్రవేశాలు

- ప్రజాశక్తితో ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/క్రైం

గురుకులాల్లో మెరుగైన విద్య అందిస్తున్నామని, మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామని ఎపి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎపిఎస్‌డబ్ల్యు ఆర్ఇఐఎస్) ఉమ్మడి కర్నూలు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా గురుకులాల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...

ఉమ్మడి జిల్లాలో ఎన్ని గురుకులాలున్నాయి? ఎంత మంది విద్యార్థులున్నారు?

కో-ఆర్డినేటర్ : కర్నూలు, నంద్యాల రెండు జిల్లాలు కలిపి 15 అంబేద్కర్ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో బాలురు కోసం 5 పాఠశాలలు, బాలికల కోసం 10 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో డోన్‌లో ఉన్నది ఈ ఏడాది ఏర్పాటవుతోంది. మిగిలినవన్నీ అప్‌గ్రేడెడ్ పాఠశాలలే. కొత్త పాఠశాల మినహా మిగతా వాటిలో 640 మంది విద్యార్థులు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలు ఎలా కల్పిస్తారు?

కో-ఆర్డినేటర్ : ప్రవేశ పరీక్ష ఆధారంగా గురు కులాల్లో ప్రవేశాలు ఉంటాయి. ఐదో తరగతిలో ప్రవేశం కోసం, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ప్రధానంగా ప్రవేశ పరీక్ష ఉంటుంది. 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీలు ఉంటే వాటికి ప్రత్యేకంగా ప్రవేశ పరీక్ష పెట్టి ప్రవేశాలు కల్పిస్తారు.

విద్యార్థులకు ఎలాంటి సదుపాయాలు అందిస్తారు?

కో-ఆర్డినేటర్ : ప్రభుత్వ పాఠశాలల్లో అందించే జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తాం. ప్రత్యేక డైట్ అందిస్తాం. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్స్ ఇస్తాం. వారంలో రెండు సార్లు చికెన్ పెడుతున్నాం. ఇటీవలే డైట్ ఛార్జీలు పెంచారు. పదో తరగతి వరకూ ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1400 చొప్పున, ఇంటర్ విద్యార్థులకు నెలకు రూ.1600 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

పది, ఇంటర్‌లో ఈ సారి ఎలాంటి ఫలితాలు వచ్చాయి ?

కో-ఆర్డినేటర్ : పదో తరగతిలో 83 శాతం, ఇంటర్‌లో 76 శాతం ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలో పదిలో ఐదో స్థానంలో, ఇంటర్‌లో మూడో స్థానంలో ఉన్నాము. కర్నూలు జిల్లాలో ఏడు పాఠశాలలు ఉండగా పదో తరగతి పరీక్షల్లో సరాసరిన 80.99 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఆదోని గురుకుల పాఠశాలలో అత్యధికంగా 98.68 ఉత్తీర్ణత శాతం నమోదయింది. నంద్యాల జిల్లాలో ఆరు పాఠశాలలు ఉండగా పదో తరగతి ఫలితాల్లో సరాసరిన 84.26 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అత్యధికంగా లక్ష్మాపురం గురుకుల పాఠశాల 96.20 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసుకుంది. ఇంటర్మీడియట్‌లో కర్నూలు జిల్లాలో ఐఐటి గురుకుల కళాశాల ఎంపిసి, బైసిపి గ్రూపుల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించింది.

సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నారా?

కో-ఆర్డినేటర్ : పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించడానికి పార్ట్‌టైం టీచర్లను తీసుకోవాలనేది ప్రణాళిక. ప్రస్తుతం రెగ్యులర్ టీచర్ల బదిలీలు జరుగుతున్నాయి. బదిలీలు ముగిసిన తరువాత పార్ట్‌టైం టీచర్లను తీసుకుంటాం.

ఉత్తీర్ణత పెంచేందుకు చర్యలేమైనా తీసుకున్నారా?

కో-ఆర్డినేటర్ : ఎస్ఎస్‌సి అడ్వాన్స్ సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. పదో తరగతిలో ఉత్తీర్ణులు కాని వారి కోసం వాటిలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాము. చిన్నటేకూరు, డోన్‌లో ఆ శిబిరాలు నడుస్తున్నాయి. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనేదే సంస్థ లక్ష్యం. నీట్ మెడిసిన్‌లో 25 సీట్లు, ఐఐటిల్లో 35 నుంచి 40 సీట్లు సాధిస్తామని కూడా ఆశిస్తున్నాం.

విద్యార్థులకు చదువులో కాకుండా వేరే వాటిలోనూ అవగాహన కల్పిస్తున్నారా?

కో-ఆర్డినేటర్ : క్రీడల్లో కూడా గురుకుల విద్యార్థులకు శిక్షణ ఉంటుంది. నేషనల్ లెవర్ వరకూ కూడా విద్యార్థులు రాణిస్తున్నారు. ఆరోగ్యం పరంగా కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎయిడ్స్ నివారణ దినోత్సవం, టిబి నివారణ దినోత్సవం, మలేరియా దినోత్సవం వంటి ముఖ్యమైన రోజులు, చేతుల శుభ్రత దినోత్సవం, డీ వార్మింగ్ డే వంటి దినాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

- మొదటి సమావేశంలో 305 మంజూరు : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో పని చేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు 395 అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో శనివారం సాయంత్రం 2023–24కి నూతన జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీపై జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2 సంవత్సరాల కాలపరిమితితో జిల్లాలోని జర్నలిస్ట్‌లకు అక్రిడిటేషన్ల మంజూరు నిమిత్తం ప్రభుత్వ ఉత్తర్వు 38 జారీ చేసినట్లు తెలిపారు. నిబంధనల మేరకు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ద్వారా అర్హతలు కలిగిన పాత్రికేయులకు అక్రిడిటేషన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. త్వరలోనే కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో బస్సు పాసులు వర్తించేలా అనుమతికి చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీనివాసులుకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనరు, డిపిఆర్ఓ మల్లికార్జునయ్య, కమిటీ సభ్యులు బాలమద్దిలేటి, జయప్రకాష్, సాయి వర్మ, గృహ నిర్మాణ శాఖ ఈఈ మాధవరావు, కార్మిక శాఖ, ఆర్టీసీ, రైల్వే శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి వాసికి భారత్ గౌరవ్ సన్మాన్ అవార్డు

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమర్రి పట్టణానికి చెందిన డబ్ల్యూహెచ్‌ఆర్సీ (వరల్డ్ హ్యూమన్ రైట్ కౌన్సిల్) నేషనల్ ఆర్గనైజ్ కార్యదర్శి మౌలానా అబ్దుల్ మజీద్ ఆరీఫ్‌కు భారత్ గౌరవ్ సన్మాన్ అవార్డు దక్కింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో డబ్ల్యూహెచ్ఆర్సి నిర్వహించిన జాతీయస్థాయి 5వ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో భాగంగా ఆర్గనైజేషన్ తరపున ఉత్తమ సేవలందించిన అబ్దుల్ మజీద్ ఆరీఫ్‌ను గుర్తించి అవార్డును ప్రదానం చేశారు. లక్నోలో అక్కడి జడ్జీలు, న్యాయవాదులు, ఎమ్మెల్యే చేతుల మీదుగా అవార్డును ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చరవాణి ద్వారా మాట్లాడుతూ డబ్ల్యూహెచ్‌ఆర్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవార్డుల కార్యక్రమానికి ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అవార్డ్ అందుకున్న మజీద్ ఆరీఫ్‌ను పలువురు అభినందించారు.

ముస్లిం మైనార్టీ నాయకులు వైసిపిలో

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని 6వ వార్డ్‌కు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు వైసిపిలో చేరారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు రహిమాన్, అబ్దుల్ ఖాదర్, హమీద్, షంశీర్, సత్తార్, ఖాదర్ బేగ్‌లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పుకొని వైసిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తుండడంతో ఆకర్షితులై వైసిపిలో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డ్ మెంబర్ కుమ్మరి సురేష్, 16వ వార్డ్ మెంబర్ జిటి వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

ఘనంగా చల్లా భగీరథ రెడ్డి జయంతి

- ప్రభుత్వాస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - అవుకు

దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి జయంతి వేడుకలను అవుకులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి కుమారులు చల్లా రాజ్యాభిషేక రెడ్డి, జూనియర్ చల్లా రామకృష్ణారెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు చల్లా ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు, చల్లా రామేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి చల్లా రామకృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పించారు. అనంతరం చల్లా భగీరథ రెడ్డి సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళ్లులు అర్పించారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. చల్లా అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. తన భర్త జన్మదిన సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి రక్తదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ మామగారైన దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి మరణానంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చల్లా భగీరథ రెడ్డికి ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారని తెలిపారు. ఆయన ఎమ్మెల్సీ పదవీకాలంలో ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో ఎల్లవేళలా ప్రజల కోసం కష్టపడి పని చేసేవారని గుర్తు చేశారు. ఆయన అనారోగ్య కారణంగా మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన మరణానంతరం కూడా ప్రజల కోసం, వారి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు చల్లా విక్రాంత్ రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి, చల్లా చైతన్య రెడ్డి, చల్లా అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం : దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి జయంతి సందర్భంగా అవుకు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలను వైసిపి సీనియర్ నాయకులు చల్లా ప్రభాకర్ రెడ్డి, చల్లా రామేశ్వర్ రెడ్డిలు, అవుకు ఎస్సై నరేంద్రలు ప్రారంభించారు. జడ్పిటిసి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల నుండి 12 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. విజేతలకు బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వైసిపి నాయకుడు చల్లా ప్రభాకర్ రెడ్డి

సమాధి వద్ద పూలమాలలు వేస్తున్న కుమారులు

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి

రక్తదానం చేస్తున్న జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి

ఖత్నా కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బాబాన్, దూదేకుల సంఘం నాయకులు

ఉచితంగా ఖత్నా కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల పట్టణంలోని నూర్ నర్సింగ్ హోమ్ ఆవరణంలో డాక్టర్ బాబాన్ ఆధ్వర్యంలో ఉచితంగా ఖత్నా (వడుగుల) కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దూదేకుల పట్టణ కమిటీ అధ్యక్షులు వాసవి దస్తగిరి, కార్యదర్శి ఆదామ్ సాహెబ్, ట్రెజరర్ సోమశేఖర్, సహాయ కార్యదర్శులు హుస్సేనప్ప, బాల హుస్సేన్‌లు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబాన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ ఉచిత ఖత్నా కార్యక్రమం ఉచితంగా నొప్పి లేకుండా, ఆధునాతన పద్ధతిలో క్లిప్ సిస్టమ్ ద్వారా తొడుగు పద్ధతిలో చేసినట్లు చెప్పారు. పిల్లలకు బ్రెడ్, మాత్రలు, వస్త్రములు అన్ని ఉచితంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, వైద్యులు సిద్దయ్య, ఖాదర్ బాషా, ఖాదర్ బాషా, ఇలియాస్ తదితరులు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమానికి యాలూరు చిన్న హుసేని, వెస్టన్డ్ టైలర్ దస్తగిరి, మాజీ కౌన్సిలర్ దస్తగిరి, గోల్డ్ డిడిజి దస్తగిరి, మహిళా నేత సోక్రాభి, ఎలక్ట్రీషియన్ ఇస్మాయిల్ తదితరులు సహకరించారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని చెలిమిల్ల గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు, ధాన్యం, నగదు కాలి బూడిదైన కుటుంబాన్ని మహిళా సంఘం జిల్లా నాయకురాలు బి.రమణమ్మ, మాజీ ఎంపీటీసీ శివమ్మలు ఆదివారం పరామర్శించారు. వెంకట లక్ష్మమ్మకు వస్తువులు, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు ఎంసి నారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.సోమన్న పాల్గొన్నారు.

మంగంపల్లి గ్రామంలో డాక్టర్లు వైద్యం అందిస్తున్న దృశ్యం

గ్రామస్తులకు సేవలందిస్తా

- పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటీ చైర్మన్

ప్రజాశక్తి - సంజామల

పుట్టిన గ్రామంలోని ప్రజలందరికీ సేవలు అందించాలనే ఉద్దేశంతో మంగపల్లి గ్రామంలో ప్రతి నెలా చివరి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటీ చైర్మన్ దస్తగిరి రెడ్డి తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 1500 మందికి వైద్యులు ఉచితంగా వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సేవలు అందించడమే ధ్యేయమని అన్నారు. ప్రతి నెలా కర్నూల్ నుంచి అనుభవజ్ఞులైన డాక్టర్ల చేత ఉచితంగా వైద్యం అందిస్తూ మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

నేడు స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి నేడు ఉదయం 9:30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరుకావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మేజర్ పంచాయతీలోని పలు కాలనీలలో ఆదివారం విద్యుత్ స్తంభాలకు కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేశారు. సర్పంచ్ బైరివిజయలక్ష్మి ఆధ్వర్యంలో వైసిపి నాయకుడు బైరిబ్రహం పర్యవేక్షణలో ఎస్సీ కాలనీ, మెయిన్ రోడ్డు, బొరుగుల పేట, శివాలయం వీధుల్లో కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేశారు. కాలనీలలో వీధిలైట్ల సమస్య ఉండడంతో కాలనీవాసుల విన్నపం మేరకు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేసినందుకు ఆయా కాలనీల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూర్

మోడీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలను, కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సిఐటియు పట్టణ కమిటీ సమావేశం పట్టణ అధ్యక్షులు రజాక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని తెలిపారు. ఆటో, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. నిత్యావసరాల ధరలను అదుపులో ఉంచాలన్నారు. రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలు అమలు చేయాలని, ప్రత్యేక హోదా సాధనకై అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు బిజెపి విధానాలపై పోరాడాలని కోరారు. జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ సిపిఎస్ రద్దు చేయాలని, స్కీం వర్కర్లయిన అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు, స్కావెంజర్స్ యానిమేటర్లు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. అప్పటి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, కార్మికవర్గం, రైతాంగం కలిసి పోరాటాలకు సిద్ధపడాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు సురేంద్ర, నాగేశ్వరావు, భారతి, ప్రభావతి, బేగం తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం

డాక్టర్ సురేశ్ బాబుకు ఎన్‌టిఆర్ శతకరత్న పురస్కారం

ప్రజాశక్తి - ప్యాపిలి

బెంగళూరులోని శ్రీ కృష్ణదేవరాయ కళా ప్రాంగణంలో సిపి.బ్రౌన్ సేవా సమితి, స్వాతంత్ర సమరయోధులు ఇడమకంటి బ్రహ్మారెడ్డి ధార్మిక మండలి, బెంగుళూరు వారు సంయుక్తంగా నిర్వహించిన ఎన్టీఆర్ శతక రచన పోటీలలో ప్రతిభాపాటవాలను ప్రదర్శించి ద్వితీయ బహుమతి పొందినటు డాక్టర్ టి.సురేశ్ బాబుకు ఎన్‌టిఆర్ శతకరత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు. 10 వేల నగదు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. డాక్టర్ టి.సురేష్ బాబు సాహిత్య కృషి అభినందనీయమని సిపి బ్రౌన్ సేవాసమితి అధ్యక్షులు డాక్టర్ ఇడమ కంటి లక్ష్మి రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సినీనటి రమాప్రభ, చిరుధాన్యాల శాస్త్రవేత్త పద్మశ్రీ గ్రహీత డాక్టర్ ఖాదర్ వలీ, చలనచిత్ర నిర్మాత డాక్టర్ రాధాకృష్ణరాజు, ప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ వేటూరి ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలలో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని గౌడ్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. రాళ్లతో నిండిన రాయలసీమలో నీటి వనరులను సృష్టించి సిరులు పండేలా చేసిన జల బాంధవుడు ఎన్‌టి రామారావు అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. వెలుగోడు రిజర్వాయర్ ద్వారా రాయలసీమలో రైతులకు నీరందించి పంటలు పండేలా కృషి చేసిన యుగపురుషుడని అన్నారు. ప్రభుత్వం అంటే ప్రజలే అని చాటి చెప్పిన రాజకీయ తత్వవేత్త అని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సైకో పాలన కొనసాగుతుందని, దానిని తరిమి కొట్టాల్సిన సమయం ఆసన్నమయిందని అన్నారు. మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జట్టి వేణుగోపాల్, అబ్దుల్లాపురం భాష, మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** స్థానిక టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ శతజయంతి ఘనంగా నిర్వహించారు. నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వర రెడ్డి, మండల సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, ఉన్నం సుధాకర్, పోలూరు శ్రీనివాస్ రెడ్డి, బుగ్గనపల్లి రమేష్, జాకీర్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ మేకల నాగరాజు, టైలర్ రాముడు, ఎమ్మెస్, గూటం శివ పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లిలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు సర్పంచు లక్ష్మీదేవి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో జరిగాయి. నాయకులు మోహన్ యాదవ్, శివ రాముడు, మల్లికార్జున నాయక్, శ్రీరాములు, శివయ్య, బాలచంద్రుడు, బీసన్న పాల్గొన్నారు. **మహానంది :** టిడిపి శ్రీశైలం నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి బుడ్డ రాజశేఖర్ రెడ్డి పిలుపుమేరకు సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి ఆదేశాలతో మహానంది మండల సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి మండల నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. యూనిట్ ఇన్చార్జీలు మహేశ్వర్ రెడ్డి, కాకర్ల శివ, మండల నాయకులు సత్యనారాయణ చౌదరి, సీనియర్ నాయకుడు పాణ్యం ప్రసాదు, ఆర్ఎస్ శ్రీనివాసులు, హరిచంద్ర చౌదరి, అశోక్, బొల్లవరం రామకృష్ణ, నారాయణ, మద్దిలేటి, అబ్దుల్లా, శివయ్య, మౌలాలి, ఈశ్వరయ్య, హుసేని, అనిమల శివ పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు :** శ్రీశైల మండలం సుండిపెంటలోని వెస్ట్రన్ కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. టిడిపి నాయకులు కాతా రామిరెడ్డి మాట్లాడారు. నాయకులు ఆలేటి మల్లికార్జున, మైలా శ్రీను, అసుమల్లి సుబ్బారావు, మామిడికాయల శ్రీను, రమణ, రంగారావు, వెంకటేశ్వర్లు, చినబాబు, మల్లేష్, మహబూబ్‌బీ తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడులో తెలుగు యువత ఆధ్వర్యంలో నందమూరి తారకరామారావు శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగుయువత మండల అధ్యక్షుడు మధుకృష్ణ మాట్లాడారు. నియోజక వర్గ కార్యదర్శి కరీంబాషా, ఐ టిడిపి మండల అధ్యక్షుడు గట్టు లింగేశ్వర గౌడ్, సోషల్ మీడియా అధ్యక్షుడు బాషా, శేఖర్, వీరేష్, ఉస్మాన్ బాషా, వెంకటేశ్వర్లు, గోవిందు, శ్రీను, రమణ, వాజీద్, ఖాసిం, వినోద్, వెంకట్, కమలాకర్ పాల్గొన్నారు. **చాగలమర్రి :** స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు యాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియూసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, చిన్న నరసింహారెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ గౌడ్, టైలర్ భాష, కసినేని ఓబులేసు, ప్రకాశ్ బాబు, మోహన్ పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** స్థానిక టిడిపి కార్యాలయంలో ఎంవి.శివ రామిరెడ్డి, ఇటిక్యాల శివారెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డిలు టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యారెడ్డి, జి.నాగార్జున రెడ్డి, అంజి, శ్రీనివాసులు, శేఖర్, విద్యా సాగర్, మందా వెంకటేష్, నాగన్న, ఆఫీస్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లిలో..

మహానందిలో..

శ్రీశైలం ప్రాజెక్టు

పాములపాడులో..

ఆత్మకూర్‌లో ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

బేతంచెర్లలో

కొలిమిగుండ్లలో..

భానుముక్కల చర్చిలో మాట్లాడుతున్న వేల్పుల ఆనంద్

ప్రజా సేవే లక్ష్యం : వేల్పుల ఆనంద్

ప్రజాశక్తి - పాములపాడు

అవకాశం వస్తే ప్రజాసేవ చేసుకునేందుకు ముందుంటానని కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్ అన్నారు. ఆదివారం మండలంలోని భానుముక్కల, ఇస్కాల, లింగాల, పాములపాడు, రుద్రవరం, జూటూరు గ్రామాలలోని వైసిపి నాయకులను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. రుద్రవరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న శివాలయాన్ని, భానుముక్కల గ్రామంలో చర్చి నిర్మాణ పనులకు తన వంతు సహకారాన్ని ఆయన అందజేస్తానని తెలిపారు. ముందుముందు మరిన్ని సేవా కార్యక్రమాలలో పాల్గొని ప్రజలకు మరింత చేరువగా ఉంటానని చెప్పారు. ఆయన వెంట బిసి సంఘం, ఎస్‌సి సంఘం నాయకులు పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఎఫ్ఎస్ఒ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని శ్రీశైలం రేంజ్ ఎఫ్ఎస్ఒ మదన్ కుమార్, భీమ్ నాయకులు తెలిపారు. ఆదివారం సున్నిపెంట గ్రామంలో మిషన్ లైఫ్ స్టైల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫారెస్ట్ రేంజ్ అధికారి నరసింహులు, మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు జి.జోసఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడాలని, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, గ్లాసులు, వాటర్ బాటిల్ నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బిఒ రవీంద్రనాథ్ ఠాగూర్, పి.శ్రీరాములు, ప్రొటెక్షన్ వాచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

తిమ్మాపురంలో పడకేసిన పారిశుద్ధ్యం

- అధికారుల చర్యలు శూన్యం - సీజనల్ వ్యాధుల భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. గ్రామంలో బస్టాండ్‌కు వెళ్లే రహదారి మెయిన్ బజార్‌లోని డ్రైనేజీ కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఎటు చూసినా చెత్త చెదారంతో డ్రెయినేజీ కాలువ పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారింది. ఉదోమలు వృద్ధి చెందుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఫలితంగా మలేరియా, డెంగ్యూ ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. పారిశుధ్యంపై పర్యవేక్షించి మెరుగుపరచాల్సిన అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ఆర్భాటంగా చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై అధికారులకు తెలియజేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలోని పారిశుధ్య కార్మికులకు సక్రమంగా జీతాలు రాకపోవడంతో పనులు జరగడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. వచ్చేది వర్షాకాలం కావున గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోతే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువ. మండల అధికారులు, గ్రామ సచివాలయ అధికారులు ఆఫీసులకే పరిమితం కాకుండా గ్రామాల్లో ప్రజల వెతలు, సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మురికి కాలువలు శుభ్రం చేయించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

చెత్తా చెదారం తో నిండి పోయిన

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, చిన్నారులందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కౌసల్య తెలిపారు. ఆదివారం కొత్తపల్లిలోని గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవికాలంలో చిన్నారుల కోసం సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. **పగిడ్యాల :** విద్యార్థులు, నిరుద్యోగులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చే విధంగా అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారిని కే మద్దమ్మ అన్నారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పగిడ్యాల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులు గ్రంథాలయానికి వచ్చి అవసరమైన పుస్తకాలను వార్తాపత్రికలను చదివేలా అలవాటు చేసుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు నిరుద్యోగులకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. మంగళం శారద ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపల్లి : ఆటలాడుతున్న చిన్నారులు

పగిడ్యాల : విద్యార్థుల చేత కథల పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయ అధికారి మద్దమ్మ

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాల మండలంలోని ప్రాతకోట గ్రామంలో టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు శతజయంతిని పురస్కరించుకొని శాంతిరాం లేజర్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో, టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జీ మాండ్ర శివానందరెడ్డి, జిల్లా అధ్యక్షులు గౌరవ వెంకట్ రెడ్డి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి పిట్టల శేషమ్మ, టిడిపి నాయకులు, ఆర్ఎంపి వైద్యులు పిట్టల నాగశేషులు మాట్లాడారు. అనంతరం డాక్టర్ వెంకట సాయి గ్రామస్తులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 127 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 26 మందికి కంటి ఆపరేషన్ అవసరమున్నట్లు గుర్తించారు. వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల తర్వాత బస్సులో వీరిని వైద్యశాలకు తీసుకెళ్లి ఆపరేషన్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సాయిరాం లేజర్ కంటి వైద్యశాల సిబ్బంది ఇమామ్ బాబు, నవీన్, భరత్, షాషావలి, నాగలింగడు, మధు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

ఎర్రగుడిదిన్నె పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఎర్రగుడి దిన్నె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న జయరాముడు (55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మద్దికెర మండలం అగ్రహారం గ్రామానికి చెందిన జయరాముడు గత 25 సంవత్సరాల నుంచి రుద్రవరం మండలంలోని ఆర్ నాగులవరం, పేరూరు ఎర్రగుడిదిన్నె పంచాయతీలలో కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఈయనకు భార్య, పిల్లలు ఉన్నారు. గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆళ్లగడ్డలోని తన నివాసంలో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు సొంత గ్రామం అగ్రహారంలో జరుగుతాయని అధికారులు తెలిపారు. ఆయన మృతి పట్ల పలువురు అధికారులు, నాయకులు, గ్రామస్తులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

జయరాముడు (ఫైల్)

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని మల్లెంవీధికి చెందిన పునీత్ కుమార్ ఈ నెల 23 నుంచి కనిపించడం లేదనిబాధితుడి తండ్రి వాసుదేవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన వాసుదేవయ్య పోస్టల్ డిపార్ట్మెంట్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. అతని చిన్న కుమారుడు పునీత్ కుమార్ స్థానిక వాసవి డిగ్రీ కళాశాలలో అటెండర్‌గా విధులు నిర్వహించేవారు. ఈ నెల 23న మద్యాహ్నం కాలేజీకి వెలుతున్నానని చెప్పి వెళ్ళి తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయంపై బంధువుల ఇళ్ళల్లో, చుట్టు పక్కల గాలించినా ఆచూకి లభ్యం కాలేదని ఎస్ఐ తెలిపారు. బాధితుడి తండ్రి పిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వివరించారు. ఆచూకీ తెలిసిన వారు 9121101168 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.